

థియేటర్‌ను తనిఖీ చేసిన మున్సిపల్ అధికారులు

ఆదిలాబాద్‌రూరల్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని నటరాజ్ డీలక్స్ సినిమా థియేటర్‌ను గురువారం సాయంత్రం మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అపరిశుభ్రత ఉన్న మూత్రశాల, నీటి వ్యవస్థ, ఫుడ్ తదితర వాటిని పరిశీలించి నిర్వహణ సరిగా లేకపోవడంతో థియేటర్ సిబ్బందిని మందలించారు. వారం రోజుల్లోపు అన్ని సక్రమంగా ఉంచుకోవాలని లేని పక్షంలో థియేటర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

దిగుబడులపై దిగులు!





- అధిక వర్షాలు, నకిలీ విత్తనాలతో రైతుల ఆందోళన
- పెట్టుబడులు నిండక అప్పులపాలవుతున్న రైతులు
- అరకొరగా పరిహారం అందించి చేతులెత్తేస్తున్న అధికారులు
- 20 తర్వాత పత్తి కొనుగోళ్లకు అవకాశం

ఆదిలాబాద్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): ఓ యేడు నష్టం వచ్చినా.. మరో యేడు లాభం రాక పోతుందన్న అతి ధీమాతో పత్తి పంటను సాగు చేస్తున్న దిగుబడులపై మాత్రం రైతులు దిగులు పడుతున్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చే సరికి ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని వాపోతున్నారు. పంటలను ముసురుకుంటున్న చీడపీడలు, అధిక వర్షాలతో దిగుబడులపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మునుపెన్నడు లేని విధంగా ఈ యేడు రూ.501 మద్దతు ధరను పెంచినా.. దిగుబడులు వస్తాయో రావోనన్న భయం వెంటాడుతోంది. జిల్లాలో 4లక్షల 35వేల ఎకరాల్లో పత్తి పంట సాగైంది. దీంతో 27లక్షల క్వింటాళ్ల పంట దిగుబడులు వస్తాయని మార్కెటింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ప్రతిసారి అధికారుల అంచనాలు తలకిందులవుతున్నాయి. ఈ సారి కూడా అదే పరిస్థితి ఎదురయ్యే అవకాశం లేక పోలేదంటున్నారు. పక్షం రోజులుగా పంట చేతికి రావడంతో రైతులు ఇళ్లలోనే నిలువ చేసుకుంటున్నారు. ఈ నెల 20 తర్వాత పత్తి పంటను కొనుగోలు చేసే అవకాశం కనిపిస్తోంది. గతేడు క్వింటా పత్తి మద్దతు ధర రూ.7020 కాగా ఈ సారి రూ.7521గా ప్రభుత్వం నిర్ణయించింది. కానీ బయట మార్కెట్‌లో రూ.6900 నుంచి రూ.7వేల వరకు ధర పలుకుతోంది. దీంతో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం తప్పని సరిగా మారింది. జిల్లా వ్యాప్తంగా 11 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. శుక్రవారం కలెక్టర్ రాజర్షిషా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పత్తి కొనుగోళ్లకు ముహూర్తాన్ని ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది.

ఎకరాన 6క్వింటాళ్ల లోపే..

అధిక వర్షాల కారణంగా పంట ఎదుగుదల పై తీవ్ర ప్రభావం పడింది. అలాగే పంట చేతికి వచ్చే సమయంలోను సరైన నీటితడులు అందక పోవడంతో దిగుబడులు అంతంత మాత్రంగానే వస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పత్తి పంట ఎర్రబారీ పోయి ఎదుగుదల నిలిచి పోయింది. కొన్ని చోట్ల పంట ఏపుగా పెరిగిన పత్తి కాయలు నల్లబారీ పోయి నాణ్యత లేకుండా కనిపిస్తున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే నల్లరేగడి నేలల్లో ఎకరాన 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడులు వచ్చేది. కాని ప్రస్తుతం అలాంటి పరిస్థితులు ఎక్కడ కనిపించడం లేదు. ప్రస్తుతం 4 నుంచి 6 క్వింటాళ్ల లోపే దిగుబడులు వస్తున్నాయని అన్నదాతలు పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో చలి తీవ్రతతో దిగుబడులు పెరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రకాల నకిలీ విత్తనాలతో జిల్లా వ్యాప్తంగా వేల ఎకరాలల్లో పంట నష్టపోయినట్లు రైతులు చెబుతున్నారు.



ఇంటి వద్ద పత్తిని నిల్వ చేసిన రైతు

కనిపించని ధీమా..

ఎన్నో ఆశలతో పత్తి పంటను సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలోను రైతుల్లో ధీమా కనిపించడం లేదు. ఊహించని రీతిలో పంట తీవ్రంగా దెబ్బతినడం, పెట్టిన పెట్టుబడులు చేతికి వస్తాయో రావోనన్న బెంగ కనిపిస్తోంది. ఇప్పటి వరకు ఎకరాన రూ.30వేల వరకు ఖర్చు చేసినా 4 నుంచి 6 క్వింటాళ్ల లోపే దిగుబడులు వస్తున్నాయని పేర్కొంటున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు చేతికి వచ్చే అవకాశం లేదంటున్నారు. ఇప్పటికే దళారుల వద్ద అప్పు చేసి మరి పంటను సాగు చేసిన దిగుబడి లేక దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గడిచిన మూడు మాసాల్లోనే జిల్లా వ్యాప్తంగా ఐదారుగురు మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ప్రత్యామ్నయ పంటలను సాగు చేస్తూ నష్టం నుంచి గట్టెక్కె ప్రయత్నం చేస్తున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఈ యేడు క్వింటాలు పత్తి మద్దతు ధర రూ.7521 పలుకుతున్నా ఆశించిన దిగుబడులు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చేనులో పత్తిని ఏరుతున్న రైతు

కొందరికే పరిహారం..

ఈ యేడు జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో వేల ఎకరాలల్లో పంట నష్టం వాటిల్లింది. కానీ వ్యవసాయ శాఖ అధికారుల సర్వేలో 3096.03 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 2041 మంది రైతులకు రూ.3కోట్ల 9లక్షల 60వేల 750లను నష్ట పరిహారంగా చెల్లించారు. అయితే పంట నష్ట పరిహారం చెల్లింపునకు ప్రభుత్వం కొన్ని నిబంధనలు, షరతులు విధించడంతో నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందలేదని తెలుస్తోంది. దీంతో ఇటీవల ఉట్నూర్ మండలంలో రైతులు ఆందోళనకు దిగారు. 40శాతం లోపు దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వక పోవడంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో కొందరు రైతులకు మాత్రమే ప్రభుత్వ నష్ట పరిహారం అందింది. మిగతా రైతులు పరిహారానికి నోచుకోక పోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ శాఖాధికారులు చేపట్టిన పంటల సర్వేలపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

అంతంత మాత్రంగానే దిగుబడులు..



ఈ యేడు వాతావరణ పరిస్థితులు అనుకూలించిన దిగుబడులు మాత్రం అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి. ఆశించిన స్థాయిలోను మద్దతు ధర కనిపించడం లేదు. క్వింటా పత్తికి రూ.10వేలకు పైగా మద్దతు ధర ఉంటేనే లాభసాటిగా ఉంటుంది. అలాగే అధిక వర్షాలకు పత్తి పంట పూర్తిగా ఎరుపుబారీ పోయి నేలమీదనే కనిపిస్తోంది. పత్తి పంటకు పెట్టుబడులు అధికమవుతున్నాయి. దీనికంటే సోయా, శనగ, జొన్న, మొక్కజొన్న మేలనిపిస్తోంది. మద్దతు ధరను కనీస స్థాయిలోనే పెంచడంతో రైతులకు పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు.

– కాటిపెల్లి సుదర్శన్‌రెడ్డి (రైతు, తలమడుగు)

సంక్షిప్త సమాచారం

వాల్మీకి మహర్షి జయంతి



నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమాన్ని గురువారం ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజలింగు, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రేషన్‌షాపులు, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

బోథ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోనాల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను రేషన్‌షాపులను మండల ప్రత్యేక అధికారి డీఎస్‌వో అయిన వాజీద్‌అలీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్‌దుకాణాలలో రికార్డులను పరిశీలించారు. సోనాల మండల కేంద్రంలోని 18వ నెంబర్ రేషన్‌షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయాను సారంగా రేషన్‌షాపులను తెరిచి ఉంచాలని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అంతేగాక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి కేంద్రాల నిర్వహణ తీరును, రికార్డులను పరిశీలించడం జరిగింది. ఆయన వెంట డీటీ త్రియంబక్ ఉన్నారు.

బోరుబావుల మరమ్మతుపై అవగాహన

బోథ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం నుంచి కొనసాగుతున్న తాగు నీటి సహాయకుల శిక్షణ గురువారం కొనసాగింది. గ్రామాల్లో పనిచేసే తాగు నీటి సహాయకులకు బోరుబావుల మరమ్మతుపై అవగాహన కల్పించారు. బోరుపంపు పనిచేసే విధానం చెడిపోయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి ఎ.చంద్రమోహన్, వెంకటమోహన్, ఏఈఈ కళ్యాణచక్రవర్తి, ఎంపీడీవో జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొమురం భీంకు ప్రముఖుల నివాళి



నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసుల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీం వర్ధంతి కార్యక్రమం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ ఎదుట గల కొమురం భీం విగ్రహానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా నివాళులర్పించారు. ఆదివాసుల హక్కుల కోసం నిజాం సైన్యంతోపోరాడిన యోధుడు కొమురం భీం అని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అదనపు ఎస్పీ సురేందర్ రావ్, మున్సిపల్ కమిషనర్ ఖమర్, నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే నివాళి...

ఆదివాసుల సంక్షేమం కోసం కేంద్రంలోని ప్రధాని మోడీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం ఆదివాసుల ఆరాధ్యుడు కొమురం భీం వర్ధంతి కార్యక్రమాన్ని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని కొమురం భీం విగ్రహానికి బీజేపీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అలుపెరగని పోరాట యోధుడు..

జల్, జంగల్, జమీన్ కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన మహనీయుడు కొమురం భీం అని మాజీ మంత్రి జోగురామన్న పేర్కొన్నారు. గురువారం ఆదివాసీ పోరాట యోధుడు కొమురం భీం వర్ధంతి సందర్భంగా ఆదిలాబాద్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదివాసుల సంక్షేమం కోసం పెద్ద పీట వేసిందని అన్నారు.

హిందూ ఉత్సవ ఆధ్వర్యంలో..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్, సనాతన హిందూ ఉత్సవ సమితి, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొమురం భీం వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ఇవ్వాలి

- మాజీ మంత్రి జోగురామన్న



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి

జైనథ్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు రెండు లక్షల రుణ మాఫీ రైతు భరోసా పథకాలపై బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ముంచిందని, కనీసం మద్దతు ధర ఇవ్వాలని రాష్ట్ర మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జోగురామన్న అన్నారు. గురువారం జైనథ్ మండలంలోని నిరాల గ్రామంలో రైతులు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసి సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతు రుణమాఫీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 24గంటలు కరెం ట్ లేక రైతులు వేసుకున్న పంటలు ఎండిపోతున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసిందన్నారు. స్థానిక ఆదిలాబాద్ ఎమ్మెల్యే, ఎంపీలు కాంగ్రెస్ ప్రభుత్వంతో కుమ్మక య్యారని విమర్శించారు. రైతన్నల కోసం రామన్న బాట కార్యక్రమానికి ఈనెల 24వ తేదీ జిల్లా కేంద్రమైన ఆది లాబాద్ రాంలీలా మైదానికి వస్తున్న రాష్ట్ర మాజీ మం త్రి కేటీఆర్ బహిరంగ సభకు రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం.గోవర్ధన్, ఆర్.రమేష్ పాల్గొన్నారు.

గుజరాత్‌లోని మద్దతు ధరను ఇవ్వాలి..

ఆదిలాబాద్ : గుజరాత్ రాష్ట్రంలో పత్తికి ఇస్తున్న మద్దతు ధరను ఆదిలాబాద్ జిల్లాలోను ఇవ్వాలని మాజీ మంత్రి జోగురామన్న డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. దేశంలోనే అత్యంత నాణ్యమైన పత్తిని పండించే ఆదిలాబాద్ జిల్లాలో తక్కువ ధరకే పత్తిని కొనుగోలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్‌కే ప్రధాని కాదని తెలంగాణకు కూడా ప్రధాని అన్న విషయాన్ని మరిచి పోవద్దని గుర్తు చేశారు. స్థానిక బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే దీని పై కేంద్రాన్ని నిలదీయాలన్నారు. గుజరాత్‌లో పత్తికి క్వింటాల్ రూ.8257మద్దతు ధరను చెల్లించగా ఆదిలాబాద్‌లో మాత్రం రూ.7521 మద్దతు ధరను ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.

కోళ్ల పెంపకంతో లాభాలు

- ఎంపీడీవో జీవన్‌రెడ్డి

బోథ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయానికి అనుబంధంగా కోళ్ళ పెంపకాన్ని చేపట్టి లాభాలు పొందవచ్చని ఎంపీడీవో జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇందిరాక్రాంతి కార్యాలయంలో వివిధ గ్రామాల వారికి మంజూరైన కోళ్ళ యూనిట్లు లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరటికోళ్ళ పెంపకం ద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఇంటి వద్ద మహిళలు కోళ్ళ పెంపకాన్ని చేపట్టినట్లయితే లాభాదాయకంగా ఉంటుంద న్నారు. ప్రభుత్వం రూ.2,500 డీడీగా చెల్లించినట్లయితే ఒక్కోయూనిట్ కింద 20 కోడి పిల్లలను అందివ్వడం జరుగుతుందన్నారు. 35 యూనిట్లు సరఫరా చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఎం జగదేవ రావు, ఇందిరాక్రాంతి ఏపీఎం పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఆకాంక్షలను విస్మరించిన బీఆర్ఎస్

- జన్నారం వైపు కదిలిన పాదయాత్ర



ఉట్నూర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర

ఉట్నూర్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల అమలు కోరుతూ ఆదిలాబాద్ నుంచి ఉస్మానియా ఆర్ట్స్ కాలేజి వరకు చేపడుతున్న తెలంగాణ ఉద్యమకారుల పాదయాత్ర గురువారం ఉట్నూర్ నుంచి ప్రారంభమైంది. ఉట్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ అమర వీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం పాదయాత్ర ప్రారంభమైంది. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జన్నారం వైపుపాదయాత్ర కదిలింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసర్ల శ్రీశైలం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో వీరోచితంగా పోరాడిన తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు విషయంలో అన్యాయం జరిగిందన్నారు. ఉద్యమ పార్టీ ముసుగులో అధికారం చేపట్టిన కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమకారుల ఆకాంక్షలకు తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తూ వారిఆకాంక్షలను నిర్వీర్యం చేస్తూ పరిపాలన కొనసాగించారని ఆరోపించారు. ప్రస్తుత పాలకులు 250 గజాల ఇంటి స్థలం మంజూరి, ఉద్యమకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి జిల్లాలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ భవన్ ఏర్పాటు హెల్త్‌కార్డు, పెన్షన్ సౌకర్యం, ఫ్రీబస్సు సదుపాయం, తెలంగాణ కోసం డప్పు కొట్టి పాడిన కళాకారులను గుర్తించి వారికి ఉపాధి కల్పించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ఉద్యమ కారులకు సీట్లు కేటాయించాలని, ఉద్యమకారుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని తదితర డిమాండ్లతో పాదయాత్ర చేపడుతున్నట్లు వెల్లడించారు.

అంగన్‌వాడీ టీచర్ల ధర్నా



మాట్లాడుతున్న నాయకులు

ఉట్నూర్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : మినీ అంగన్‌వాడీ సెంటర్ల నుంచి మెయిన్ అంగన్‌వాడీ సెంటర్ల టీచర్లకు ఐదునెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉట్నూర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు ధర్నా నిర్వహించారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 4వేల మిని అంగన్‌వాడీ సెంటర్‌లను మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా మార్చిన ప్రభుత్వం గత ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు అంగన్‌వాడీ సెంటర్లకు హెల్పర్లను నియమించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని మంత్రులకు అధి కారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చిన ఫలితం లేకుండా పోతుందన్నారు. అంగన్‌వాడీటీచర్ల సమస్యల పరిష్కారం కోసం నవంబర్‌లో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు రత్నమాలతో పాటు ముక్తానంద, పద్మ, అనసూయ, పార్వతి, సురేఖ, లక్ష్మిలు న్నారు.

వర్షంతో రైతులకు ఇబ్బందులు



సోయాబీన్ పంటపై కప్పిన టార్పాలిన్లు

బోథ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా వర్షం కురవడంతో సోయాబీన్ పంటను అమ్ముకునేందుకు మార్కెట్ యార్డుకు వచ్చిన రైతులు పంటను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పంటను ఆరబెట్టిన రైతులు వర్షంతో తీవ్ర ఇబ్బం దులకు గురయ్యారు. చిన్నపాటి వర్షానికి తేమ వచ్చే సోయాబీన్ పంట నాణ్యత దెబ్బతినే ఆస్కారం ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్త పరు స్తున్నారు. మరో వైపు పంటను కోసి విత్తనాలు తీసే సమయంలో వర్షం వల్ల పంటలకు నష్టం సంభవించే ఆస్కారం ఉందని రైతులు వాపోతున్నారు. ఆక స్మికంగా కురిసిన వర్షం వల్ల పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

వైద్యులుగా ఎదగాలి

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలలో క్రమ శిక్షణతో చదువుకొని మంచి వైద్యులుగా ఎదగాలని రిమ్స్ సంచాలకులు డాక్టర్ రాథోడ్ జైసింగ్ సూచించారు. ఈ ఏడాది మొదటి సంవత్సరం ఎంబీబీఎస్‌లో చేరిన విద్యార్థులకు ఆడిటోరియంలో ఓరియంటేషన్ సమావేశం నిర్వహించారు. సంచాలకులు మాట్లాడుతూ ప్రధానంగా ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తమని తాము పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వంజరి, వైస్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

అధ్వానంగా అంగన్‌వాడీ భవనం

సిరికొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ... మాతాశిశు మరణాలను నివారించా లనే సంకల్పంతో ఏర్పాటుచేసిన అంగన్వాడీ కేంద్రాలు అవస్థల కు నిలయాలుగా దర్శనమిస్తున్నాయి. అధికారుల అలసత్వం, గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా అంగన్వాడీ భవనాలు మూన్నాళ్ల ముచ్చటగానే మారిపోతున్నాయి. వివరాల్లోకి వెళితే... సిరికొండ మండలంలోని లచ్చింపూర్ (బీ) గ్రామపంచాయతీ పరిధిలోని బోరింగ్‌గూడలో గత సంవత్సరం రూ.5 లక్షల నిధులతో నిర్మించిన అంగనావాడీ భవనం ఏడాది తిరగకుండానే శిథిలా వస్థకు చేరుకుంది. భవనంలోని ఫ్లోరింగ్‌ను నాసిరకంగా నిర్మిం చడంతో భవనం ప్రారంభించిన నాలుగైదునెలలకే గుంతలు పడి పూర్తిగా గది నేల అంతా అధ్వానంగా తయారైంది. గతంలో ఈ గ్రామంలో చిన్నారులకు అంగన్వాడీ భవనం లేకపోవడంతో ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగి భవనం మంజూరు చేయిస్తే... అధికారుల నిర్ల క్ష్యం వల్ల అంగన్‌వాడీ భవనం నాసిరకంగా నిర్మించగా నాలుగు నెలలకే శిథిలా వస్థకు చేరు కుందని గ్రామస్తులు వాపోయారు. చేసేదే మిలేక గర్భిణులు, బాలిం తలు, చిన్నారులకు అంగ న్వాడీ టీచర్ అదే భవ నంలో ఏర్పడిన మట్టి గుం తల్లోనే కూర్చోబెట్టి పౌష్టికాహారం అందిస్తూ, చిన్నారులకు పాఠాలు బోధిస్తు కాలం వెల్లదీస్తున్నారు. ఇదే విషయమై పలు మార్లు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన స్పందించడం లేదని వారు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


అధ్వానమైన ఫ్లోరింగ్



బోరింగ్ గూడ అంగన్‌వాడీ కేంద్రం

అపరిశుభ్రంగా క్వార్టర్స్

● పట్టించుకోని సిబ్బంది

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెత్తా చెదారం ఎక్కడికక్కడే కనిపిస్తుంది. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆదిలాబాద్ ఎంపీపీ క్వార్టర్స్ ఆవరణలో 2 వారాలుగా మున్సిపల్ చెత్తబండి రాలేదని, ఎన్నిసార్లు మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించినా ఫలితం లేదని అక్కడున్న మాజీ ఎంపీపీ సెవ్వలక్ష్మి జగదీష్ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అక్కడ దోమల బెడదతో అనారోగ్యాల పాలవుతున్నామని ఆయన వాపోయారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని పరిశుభ్రత పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.


ఎంపీపీ క్వార్టర్స్ ఆవరణలో చెత్తాచెదారం

అమరవీరుడికి ఘన నివాళి

ఉట్నూర్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): నిజాం సైన్యంతో పోరాడి వీర మర ణం పొందిన అమరవీరుడు కొమురం భీం గిరిజనుల గుండెల్లో అమర వీరుడుగానే ఉంటాడని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జు పటేల్ అన్నా రు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణలో ఉన్న అమరవీరుడు కొమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి బిడ్డల హక్కుల సాధన కోసం జల్ జంగల్ జమీన్ కోసం నిజాం సైన్యంతో పోరాడి వీర మరణం పొందారని, ఆయన మరణం తర్వాతనే ప్రభుత్వాలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను గిరిజనులకు అందిస్తున్నాయని అన్నారు. తెలం గాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారన్నారు. అలాగే కొమురంభీం విగ్రహానికి బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు రితేష్‌రాథోడ్ భీమ్ విగ్ర హానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉట్నూర్ మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆసుప త్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఉపేందర్ ఆధ్వర్యంలో కొమురంభీం చిత్ర పటానికి పూలమాలలు వేసి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. కొమురంభీం ప్రాంగ ణంలోని భీమ్‌విగ్రహానికి ప్రజా హక్కుల సంఘం నేతలు బానోత్‌రా మారావు ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాటంరమేష్, ఎల్లుండిసునిల్‌లు భీమ్ విగ్రహానికి నివాళులర్పించారు.మండలంలోని గిరిజన గ్రామాలలో గిరిజ నులు తమ ఆరాధ్య దైవం కొమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి గ్రామ గ్రామాన నివాళులర్పించారు.



తలమడుగు: ఆదివాసీల స్వయం పాలన కోసం జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన గిరిజనుల ముద్దుబిడ్డ కొమురం భీమ్ వర్ధంతిని జరుపుకుని ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకుడు కుమ్ర జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కుమురం భీమ్ వర్ధంతిని అధికారికంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని అలాగే ఆదివాసీ చట్టాలను ఆదివాసీ ప్రాంతంలో అమలు చేయాలని పీసా చట్టం 1/70 చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఆదివాసీ మహిళపై అత్యాచారం జరిపిన దుండగుడిని ఉరితీయాలని, ఐటీడీఏ ద్వారా ఆదివాసీ నిరుద్యోగులకు ఏజెన్సీ డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అదే విధంగా ఆదివాసీ గిరిజన గ్రామాల కోసం ప్రత్యేక నిధులుకేటాయించాలని కోరారు. కార్యక్రమంలో తలమడుగు గ్రామ పటేల్ దుర్వా, దర్శ్వా, నీలగిరి అశోక్, కడే స్వామి, నల్ల పద్మకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చంటి, నేతలు గం గన్న, దుర్వా నేందర్, గోడం ప్రభాకర్, లింగన్న, ఆదివాసీ, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంలో కొమురం భీమ్ వర్ధంతిని గురువారం ఆదివాసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న భీం విగ్రహాన్ని నీటితో శుభ్రం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసుల సంప్ర దాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆది వాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు పెందూర్ జలపతి, ఆదివాసీ సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాయి సిడం జంగు పటేల్, బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కోవ భగవాన్, ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు సెడ్మకి భీంరావు, నాయకులు ఉయిక లక్ష్మణ్, భూమా పటేల్, పెందూర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: కొమురం భీమ్ గొప్ప పోరాట యోధుడని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పలువురు పేర్కొన్నారు. కొము రం భీమ్ వర్ధంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గోండుగూడ నుంచి ర్యాలీగా వచ్చి భీమ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు కొమురం భీమ్ పోరాట పటిమను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుష్పలతా, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పూర్క చిత్రు, మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్‌రావు, నాయకులు కనక తుకారం, జుగ్నాక్ భారత్, ఆర్క ఖమ్ము పాల్గొన్నారు.

మావల: జల్ జంగల్ జమీన్ నినాదంతో అడవి బిడ్డల హక్కుల కోసం పోరాడిన కొమురం భీమ్ పోరాట పటిమ ఎన్నటికీ మరువలేనిదని, వారి ఆశయ సాధన కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం కొమురం భీమ్ వర్ధంతిని పురస్కరించుకుని జిలా కేంద్రంలోని కొమురం భీమ్ చౌక్‌లోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నేతలతో కలిసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, ఆదివాసీ జిల్లా ఉపాధ్యక్షులు మారసుకోలా అశోక్, మాజీ ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, మాజీ కో ఆప్షన్ మెంబర్ రహీమ్ కాన్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, మావల ఎస్టీ సెల్‌అధ్యక్షులు మర్సకోళ్ల గౌతమ్, బీసీ సెల్ అధ్యక్షులు గోసుకూరి రాజేందర్, వెంకటేష్, రంజిత్‌రెడ్డి, లస్మన్న, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్

బోథ్ : సోనాల మండల కేంద్రంలో గురువారం కొమురం భీమ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివాసులు ఘనంగా నిర్వహించారు. వర్ధంతిని పురస్కరించుకుని పలు రాయిసెంటర్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి ఆదివాసీలు తరలివచ్చి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐటీడీఏ మాజీ డైరెక్టర్ భూమన్న సార్ మేడి లక్ష్మణ్, గీతాదర్, ఆత్రం గంగాధర్, లాలారామ్, నైతం దేవరావు, నేతకాని మహార్ సంఘం అధ్యక్షులు భీమ్రావు, మాజీ సర్పంచ్ మారుతి, కిషన్, రోహిదాస్, నాగారావు, గణపతి, వసంతరావు తదితరులు పాల్గొన్నారు. భూమికోసం భుక్తి కోసం నైజాం ప్రభుత్వాన్ని ఎదిరించిన ధీరుడు జీవనాన్ని నేటి సమాజం ముఖ్యంగా ఆదివాసీలు ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి వైపు అడుగులు వేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ బోథ్ డివిజన్ అధ్యక్షులు దుర్వేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో కొమురం భీమ్ వర్ధంతిని పురస్కరించుకుని బోథ్ బస్టాండ్‌లో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై ప్రవీణ్ భీమ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురం భీమ్ హక్కుల కోసం పోరాడిన గొప్ప ధైర్యవంతుడని ఆయన జీవితం ఆదర్శంగా తీసుకుని వారి వారి హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కుడుమే రాజన్న, మండల కమిటీ అధ్యక్షులు కనక అమృతరావు, కార్యదర్శి మండాడి రాము, జిల్లా సలహాదారు పంద్రం శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు రామిల్లి భోజన్నతో పాటు పాట్నాపూర్ సార్‌మేడి, ఆడేం భీమ్‌రావు, ఉద్యోగ సంఘం నాయకులు తుడసం భూమన్న, మండాడి నాగరావు, రిటైర్డ్ ఉద్యోగులు వెంకటరావు, ఆదివాసీ నాయకులు విజయ్, జుగాది రావు, మడావి మనోహర్‌లతో పాటు ఆదివాసీ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

నేరడిగొండ : జల్‌జంగల్ జమీన్ కోసం పోరాడిన యోధుడు కొమురంభీం వర్ధంతి వేడుకలను గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజనులు భుక్తి విముక్తి కోసం నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి అమరుడయ్యాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆత్రంగంగారాం, పెరుమాండ్ల గంగాధర్, జుగ్నక్ సాంబన్న, మండాడి భీంరావ్, కోట్నాక్ కోటేశ్వర్, ఆత్రంలక్ష్మణ్, ఎంపీడీఓ రాజ్‌వీర్, ఎంపీఓ లక్ష్మణ్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నార్నూర్ : జల్ జంగల్ జమీన్ నినాదంతో పోరాటం చేసి నిజాం నవాబుకు ఎదురెల్లిన గొప్ప పోరాట యోధుడని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.గజానంద్‌నాయక్ అన్నారు. ఆదివారం భీం వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న కొమురంభీం విగ్రహం పూలమాల వేసి నివాళులర్పించారు. వారి వెంట తుడందెబ్బ నాయకులు మడా వి మనుకు, జేఏసీ మాజీ చైర్మన్ ఉత్తంరాథోడ్, యశ్వంత్‌రావు, చవాన్ దిగంబర్ ఆడే పెసా చట్టం కో ఆర్డినేటర్ సికిందర్‌రాథోడ్ ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యదర్శి ఆర్కాగోవింద్‌రావు షేక్ అహమ్మద్ సురేష్ ఆడేదాదే అల్లికొరల మహేందర్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: ఆదివాసీల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు కొమురం భీమ్ అని ఆదివాసి నాయక్‌పోడ్ సేవా సమితి జిల్లా ఉపాధ్యక్షుడు జాన్ సత్య అన్నారు. మండలంలోని న్యూ లోలం, మాడెగాంలలో గురువారం కొమురం భీమ్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీలంతా సంఘటితం కావాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆదివాసి సేవా సంఘం రాష్ట్ర నాయకులు భూమయ్య, జిల్లా నాయకులు మంద మల్లేష్, గోవిందుల మహేష్, సుంకరి రాజు, తదితరులు పాల్గొన్నారు.


గుడిహత్నూర్‌లో కొమురం భీమ్‌కు నివాళి

దస్తురాబాద్ : జల్ జంగల్ జమీన్‌కై పోరాడిన గోండు బెబ్బులి కొమురం భీమ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వద్ద ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) మండల అధ్యక్షులు మెస్రం సురేందర్ పేర్కొన్నారు. గురువారం కొమురం భీమ్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని కొమురం భీమ్ చౌరస్తాలోని భీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... భీమ్ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి తొడసం కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు సీడం రాజు, కే. మోహన్, సహా కార్యదర్శి తొడసం రాజేందర్, రాయిసీడం సోము పటేల్, కే. దేవురావు, మెస్రం లక్ష్మీపతి, ఎం. మధు, ఎం. రమేష్, సీడం నాగేష్, ఆడ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పెంబి : జల్ జంగల్ జమీన్ కోసం ఆదివాసీల హక్కుల సాధన కోసం నిజాంపాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కొమురం భీమ్ అని పెంబి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్ రెడ్డి ఎమ్మెల్యే పేర్కొన్నారు. గురువారం పెంబి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వప్నిల్ రెడ్డి మాట్లాడుతూ... నిజాం పాలనకు వ్యతిరేకంగా అటవీ హక్కుల సాధనకై నిరంతరం భీమ్ పోరాడారన్నారు. భీమ్ పోరాటం అందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. ప్రతి ఒక్కరూ భీమ్‌ను ఆదర్శంగా తీసుకొని ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవేందర్ రెడ్డి, స్వామి, భూమేష్, బోరె రమేష్, రాజన్న, అర్జన్న, గుడిసె రమేష్, శ్రీకాంత్ ఖాన్, చారి, రాజు, వెంకీ, భూమేష్, భీమన్న, తదితరులు ఉన్నారు.


వేడుకలకు హాజరైన ఆదివాసీలు

నిధుల మంజూరుపై క్షీరాభిషేకం

బోథ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న దన్నూర్ గ్రామస్తులకు ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి కోటి 30 లక్షల రూపాయలు మంజూరు చేయడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు గ్రామస్తులు కలిసి మంత్రి సీతక్క చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన మంత్రికి గ్రామస్తులు తమ గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించడంతో పాటు అవసరమైన బ్రిడ్జిని మంజూరు చేయాలని కోరారు. అయితే అప్పుడు ఇచ్చినమాటప్రకారం మంత్రి నిధులు మంజూరు చేయిస్తూ ప్రొసీడింగ్స్ ఇవ్వడంతో మంత్రికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బి.గంగారెడ్డి, దన్నూర్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కాంగ్రెస్ నాయ కులు ఇంద్రారెడ్డి, పశుల చంటి, గడ్డల నారాయణతో పాటు పలువురున్నారు.

పెండింగ్ ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

● టీజీవీపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కొట్టూరి ప్రవీణ్

నిర్మల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కొట్టూరి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం నిర్మల్ జిల్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంటనే ఫీజు రీయిం బర్స్ మెంట్ విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థులతో, కళాశాల యాజమాన్యాలతో ఆడుకుంటుందన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల టీజీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ కో-కన్వీనర్ మిథున్, కిరణ్, బన్నీ, సంతోష్ సంపత్, సాయి, నందీశ్వర్, సృజన్, షఫీక్, అభిద్, తదితర టీజీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

● ఎంపీడీవో రాధా రాథోడ్

లక్ష్మణచాంద, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఎంపీడీవో రాధారాథోడ్ అన్నారు. మండలంలోని బాబాపూర్ గ్రామంలో ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. రానున్న రోజుల్లో గ్రామానికి, కూలీలకు ఉపయోగపడే పనులను మాత్రమే గుర్తించి ప్రణాళికలో పొందుపరచాలని తెలియజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకోవాలని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చందు, ఈసీ దినేష్, ఫీల్డ్ అసిస్టెంట్ భీమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆపద సమయంలో 100కు డయల్ చేయండి : ఎస్సై సుమలత

లక్ష్మణచాంద, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అత్యవసరమైన ఆపద సమయంలో 100కు డయల్ చేయాలని ఎస్సై సుమలత అన్నారు. మండ లంలోని ధర్మారం గ్రామంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామంలో దొంగతనాలు, ఇతర నేరాలు జరగకూడదంటే సీసీ టీవీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడకూడదని తెలిపారు. అపరిచిత వ్యక్తులు కాల్ చేసి మీ ఆధార్, బ్యాంక్ వివరాలు గాని, ఓటీపీలు గాని అడిగితే ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వకూడదన్నారు. అనవసర లింకులను ఓపెన్ చేస్తే మీ ఖాతాలో ఉన్న డబ్బులు మాయమవుతాయని, కాబట్టి జాగ్రత్తగా ఉండాలన్నారు.

ప్రజాగళం సభను శాంతియుతంగా నిర్వహించాలి

దిలావర్‌పూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం జరిగే ప్రజాగళం బహిరంగ సభను శాంతియుతంగా నిర్వహించాలని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాటసమితి సభ్యుల సమావేశంలో మాట్లాడారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యను ఉపేక్షించే ప్రశ్నే లేదన్నారు. ఏది జరిగినా మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బహిరంగ సభలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగి స్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమా వేశంలో నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

రైతు పోరుబాట కార్యక్రమ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 24న ఆదిలాబాద్‌లోని రాంలీల మైదానంలో నిర్వహించనున్న రైతు పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో మండలంలోని చాంద(టీ), జందాపూర్, భీంసరి, పొచ్చెర, గిమ్మ, అర్లి, లాండసాంగ్వి గ్రామాల కార్యకర్తలతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు పోరుబాట కార్యక్రమ వాల్ పోస్టర్లను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ, రైతు భరోసా విడుదల చేయాలని డిమాండ్‌తో చేపట్టే కార్యక్రమానికి కేటీఆర్ హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంద్రత్ రమేష్, కనక రమణ, మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

మండల వ్యవసాయ శాఖ అధికారి బాధ్యతల స్వీకరణ

బోథ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బోథ్ మండల వ్యవసాయ శాఖ అధికారిగా లింగంపల్లి రవితేజ గురువారం బాధ్యతలు చేపటారు. ఇటీవల నూతనంగా విధుల్లోకి చేరిన ఈయనను బోథ్ వ్యవసాయ శాఖ అధికారిగా పోస్టింగ్ ఇవ్వడంతో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

దస్తురాబాద్ నూతన విద్యుత్ ఏఈగా శ్రీనివాస్

దస్తురాబాద్ : మండల విద్యుత్ శాఖ నూతన ఏఈగా తుమ్మల శ్రీనివాస్ విద్యుత్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏఈగా పని చేసిన కేశెట్టి శ్రీనివాస్ చెన్నూర్ సబ్‌డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఏఈ తుమ్మల శ్రీనివాస్ విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అక్రమ లేఅవుట్లను వేసి అమ్మితే కఠిన చర్యలు

దిలావర్‌పూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్ర మంగా లే అవుట్లు వేసి ప్లాట్లను విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని ఎం పీవో గోవర్ధన్ అన్నారు. గురువారం మండల కేంద్రం పరిధిలో వేసిన లే అవుట్లను పరిశీలించారు. అనుమతి పొందిన లే అవుట్ లేకుండా అక్ర మంగా ప్లాట్లుగా మార్చి అమ్మితే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడమే కాకుండా గృహ నిర్మాణానికి అనుమతి లభిం చదన్నారు. ప్లాట్లు కొనుగోలు చేసే వారు సైతం లే అవుట్ చట్టబద్ధ మైనదా... కాదా అని చూసుకుని ప్లాట్లు కొనుగోలు చేయాలన్నారు. ఎంపీవో వెంట గ్రామ పంచాయతీ ఈవో చంద్రశేఖర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సంతోష్, స్థానిక నాయకులున్నారు.

పంచశీల సూత్రాలతో శాంతి

● పూజ్య భంతే జీవక్

ఇంద్రవెల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడు ప్రవచించిన పంచశీల సూత్రాలు ఆచరించడం వల్ల ప్రపంచ శాంతితో పాటు సమాజాభివృద్ధి సాధ్యమని పూజ్య భంతే జీవక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని బౌద్ధ ఉపాసకులు ఆధ్వర్యంలో వర్షవాస్ ముగింపు కార్యక్రమంలో భాగంగా దమ్మ గ్రంథతో భారీ ర్యాలీ మిలింద్‌నగర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భంతే జీవక్ మాట్లా డుతూ బుద్ధుడు సమస్త మానవాళికి శాంతి మార్గాన్ని బోధించారని, నిత్య జీవితంలో బుద్ధుడి ప్రవచనాలు, సూత్రాలు పాటిస్తే ఉన్నత విలువలతో కూడిన జీవనాన్ని గడపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే, మనోహర్ పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

నర్సాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మండలంలోని సాయినగర్ తండా, బూరుగుపల్లి(జీ), గొల్లమాడ గ్రామాల్లోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎంఈవో కిషన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యా ర్థుల హాజరుశాతాన్ని, మధ్యాహ్న భోజన పనితీరును పరిశీలించారు. విద్యార్థుల పుస్తకపఠనాన్ని పరిశీలిం చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంతమ్మ, బాబు సింగ్, తదితరులు ఉన్నారు.

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు


కౌటా(బీ) గ్రామంలో వేడుకలు

బోథ్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కౌటా (బీ), సోనాల గ్రామాలలో వ్యాస మహర్షి జయంతి వేడుకలను జరు పుకున్నా రు. కౌటా(బీ)లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకోవాలని సోనాలలో ఉపాధ్యాయులు ఆర్.మధుసూధన్, రిటైర్డ్ ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో జయంతి వేడు కలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి పూలమాలలు వేసి జయంతి వేడుకలను జరుపు కున్నారు. కౌటా(బీ)లో జరిగిన కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సున్నపు శ్రీనివాస్‌తో పాటు కొండేనా సాయన్న ముదిరాజ్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

దస్తురాబాద్ : రామాయణ గ్రంథం సృష్టికర్త మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను మండలంలోని దేవునిగూడెం గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బోయ కులస్తులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వేగవంతం చేయాలి : ఎంపీడీవో

మామడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటిపన్ను వసూళ్లను వేగవం తం చేయాలని ఎంపీడీవో మంజులాపురం గంగాసాగర్‌రెడ్డి అన్నారు. గురు వారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్య దర్శులు సమీక్షా సమావేశం నిర్వహించారు. వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

చికెన్ ధరలు

లైవ్ చికెన్ ధర కిలోకు	రూ.136
విత్ స్కిన్ చికెన్ ధర కిలోకు	రూ.197
స్కిన్‌లెస్ చికెన్ ధర కిలోకు	రూ.224

సినిమా గైడ్ ఆదిలాబాద్, నిర్మల్

నిర్మల్
తిరుమల
: ది గోట్
నారాయణ
: సరిపోదా
శనివారం


జోడేఘాట్‌లో పూజ చేస్తున్న ఆదివాసీలు


నివాళులర్పిస్తున్న మంత్రి


నివాళులర్పిస్తున్న ఎంపీ


పోరాట వీరునికి ఘన నివాళి

- జనసంద్రమైన జోడేఘాట్
- వేలాదిగా తరలి వచ్చిన గిరి'జనం'
- మంత్రి సీతక్కతో పాటు పలువురి ప్రముఖుల నివాళులు

ఆసిఫాబాద్/ ఆసిఫాబాద్‌రూరల్/ కెరమెరి, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): జల్ జంగల్ జమీన్ కోసం, ఆదివాసి హక్కుల సాధన కోసం పోరాడి అసువులు బాసిన పోరాట వీరుడు ఆదివాసీల ఆరాధ్యదైవం కొమురం భీం 84వ వర్ధంతి సందర్భంగా జోడేఘాట్ జనసంద్రమైంది రాష్ట్ర ప్రభుత్వం కొమురం భీం వర్ధంతిని అధికారికంగా చేపట్టడంతో జోడేఘాట్‌కు వేలాదిగా గిరిజనులు తరలి వచ్చారు. గురువారం కొమురంభీం వర్ధంతి ఉత్సవాలకు రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, ఎంపీ గొడెం నగేష్, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబు, కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, వెడ్మబొజ్జు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, రామగుండం కమీషనర్ శ్రీనివాస్, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, భీం మనుమడు సోనేరావు, టీపీసీసీ కార్యదర్శి, కరీంనగర్ గ్రంధాలయసంస్థ ఛైర్మన్ సత్తు మల్లేష్, ఆదివాసి సంఘం నాయకులు పాల్గొని పోరాట యోధుడు కొమురం భీం విగ్రహానికి పూల మాలలు వేసి, ఆయన సమాధి వద్ద ఘన నివాళులు అర్పించారు. కొమురంభీం వర్ధంతికి ఉమ్మడి జిల్లానలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రల నుంచి గిరిజనులు వేలాదిగా తరలి వచ్చారు. దీంతో జోడేఘాట్ జన సంద్రంగా మారింది.


మాట్లాడుతున్న మంత్రి సీతక్క


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు


డప్పు వాయిద్యాలతో వస్తున్న కళాకారులు


సభకు హాజరైన ప్రజలు

రాములగూడలో బేస్మెంట్ లెవల్‌కే పరిమితమైన డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు



నిర్మాణం పూర్తికాక గుడిసెలోనే ఉంటున్నాం..

- దాంజీ, లబ్ధిదారుడు



ఝరి పంచాయతీ పరిధిలో రాములగూడ గ్రామానికి గత పదేళ్ల క్రితం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. ఇళ్ల నిర్మాణం అవుతున్నాయని ఉన్న పాత ఇంటిని తీసేసి గుడిసె వేసుకుని అందులోనే జీవనం సాగిస్తున్నాం. పదేళ్లు దాటినా ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణ పనులు పూర్తికాలేదు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం తవ్విన గుంతలో బేస్మెంట్ పిచ్చిమొక్కల మొలసి చెట్లు అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

కలగానే సొంతిల్లు!

- డబుల్ బెడ్‌రూమ్ ఇంటి కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- దశాబ్దం గడిచినా నెరవేరని సొంతింటి కల
- పత్తాలేని కాంట్రాక్టర్, పట్టించుకోని అధికారులు




పదేళ్లుగా గుడిసెలో జీవనం సాగిస్తున్న లబ్ధిదారుడు

తలమడుగు, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది. పేదలందరికీ డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పి గత ప్రభుత్వం పేదలను మోసం చేసింది. కొందరి డబుల్ బెడ్‌రూమ్ ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల 50వేలను మంజూరు చేసినా కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో నిర్మాణాలు పూర్తి కాలేదు. దశాబ్దాలు దాటినా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాలేదని, ఈ నిర్మాణం అవుతుందని ఉన్న ఇంటిని పీకీ వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ చలికి వణుకుతూ ఆ పందిట్లోనే జీవనం సాగిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో ఆదివాసీ గిరిజనులు ఆందోళన చేస్తున్నారు.

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఝరి గ్రామ పంచాయతీకి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల క్రితం 25 ఇళ్లు మంజూరు చేయగా ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులను ఎంపిక చేసి ఇంటి నిర్మాణ పనులను అధికారులు నిర్మాణ పనులు కాంట్రాక్టర్లకు అప్పగించారు. సదరు కాంట్రాక్టర్ త్వరగా ఇళ్ల నిర్మాణం చేపడతానని చెప్పి లబ్ధిదారుల నుంచి ఇంటి నిర్మాణం కోసం ప్రతి లబ్దిదారుని దగ్గర రూ.20 వేల తీసుకుని పనులు ప్రారంభించారు. కాని ఆ పనులు బేస్మెంట్ వరకే పూర్తిచేశారు. అప్పటినుంచి ఇప్పటి వరకు పనులపై అధికారులు గాని, కాంట్రాక్టర్లు గాని ఎవరూ పట్టించుకోకపోవడం లేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. గత ఎన్నికల సమయంలో నియోజకవర్గ స్థాయి అధికారులకు వారి సమస్యను విన్నవించగా ఎన్నికల తరువాత ఇళ్లను పూర్తిస్థాయిలో నిర్మించి ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఆ గ్రామం వైపు ఎవరూ రాలేదన్నారు. దీంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న గుడిసెలోనే జీవనం సాగిస్తున్నామన్నారు. ఒక పక్క దట్టమైన అడవి, ఏ క్షణంలో ఏ విష జంతువు వస్తుందో అన్న భయంతో ఉన్నామన్నారు. అంతేకాకుండా ఆ పూరి గుడిసెలోనే ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారి ఆవేదనను విన్నవించారు. ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన ఆదివాసీ గిరిజనుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఝరీ గ్రామ పంచాయితీ పరిధిలోని కొత్తగా ఏర్పడిన రాములగూడ గ్రామానికి ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. సీసీ రోడ్ల నిర్మాణం, మురికి కాలువల నిర్మాణం, తాగునీటి సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదంటున్నారు. జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులు గ్రామ పంచాయితీకి వచ్చినప్పటికీ రాములుగూడ గ్రామానికి ఎవరూ రావడం లేదన్నారు. రాముడుగూడ గ్రామానికి చెందిన విద్యార్థులు సైతం చదువుకోడానికి దూరంగా వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయంటున్నారు. అధికారులు స్పందించి దశాబ్దాలుగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచే యాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

దశాబ్దం క్రితం ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

ఝరి గ్రామ పంచాయతీ పరిధిలో రాములుగూడ గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు 25 నిర్మాణం కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు భూమిపూజ చేసి పనులను ప్రారంభించగా, కేవలం బేస్మెంట్ వరకే సదరు కాంట్రాక్టర్ పనులను చేపట్టారు. బేస్మెంట్ వర్క్ చేపట్టిన నిర్మాణ పనుల్లో పిచ్చి మొక్కలు మొలసి వృక్షాలుగా మారినా ఇప్పటి వరకు ఆ డబ్బులు పెట్టరా ఇళ్ళ నిర్మాణంపై ఎవరూ పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు వాపోయారు. నిర్మాణం కోసం ఉపయోగించిన ఇనుముకు తుప్పు పట్టి విరిగిపోతున్నాయని వారు తెలిపారు. అంతేకాకుండా నిర్మాణ పనుల్లో పిచ్చి మొక్కలు పెరిగి చెత్తాచెదారం నిండి దోమలకు, విష కీటకాలకు నిలయంగా మారిందన్నారు. అధికారులు స్పందించి నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఎవరికి చెప్పినా.. పట్టించుకోవడం లేదు

- ఇంద్రు పటేల్, లబ్ధిదారుడు



తలమడుగు మండలం ఝరి గ్రామ పంచాయతీ పరిధిలోని రాములగూడ గ్రామంలో గత పది సంవత్సరాల నుంచి అసంపూర్తిగా ఉన్న డబుల్ ఇండ్ల నిర్మాణ పనులపై అధికారులకు, నాయకులకు ఎవరికి చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో వచ్చిన నాయకులకు విన్నవించగా ఎన్నికల తరువాత నిర్మాణ పనులు పూర్తి చేస్తామని చెప్పి దాదాపు ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు ఎవరూ కూడా గ్రామం వైపు రాలేదు.


మొక్కలతో నిండి ఉన్న రాములగూడలో చేపట్టిన డబుల్ బెడ్ల నిర్మాణాలు

ప్రజాగళం సభ ఏర్పాట్ల పరిశీలన

దిలావర్‌పూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా శుక్రవారం నిర్వహి స్తున్న ప్రజాగళం బహిరంగ సభ ఏర్పాట్లను ఎస్పీ జానకి షర్మిల గురువారం రాత్రి పరిశీలించారు. బహిరంగ సభకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ప్రజాగళం బహిరంగ సభను శాంతియుతంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగితే ఉపేక్షించేది లేదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.


ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎస్పీ

ఆంధ్రజ్యోతి పరిశీలన



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

మరుగుదొడ్ల మరమ్మతులెప్పుడో?

- తలమడుగు సర్కార్ దవాఖానాలో బాలింతలకు తప్పని ఇబ్బందులు
- మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్లు

తలమడుగు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మాతాశిశు మరణాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేసుకోవాలని అవగాహన కల్పిస్తోంది. కానీ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతోంది. మరుగుదొడ్ల మరమ్మతులపై ఆసుప్రతిలో సంబంధిత అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తలమడుగు మండల కేంద్రంలో గల మదర్ ఆరోగ్యకేంద్రంలో గత కొంతకాలంగా మరుగుదొడ్లు మరమ్మతులకు గురైనప్పటికీ వాటిని ఎవరూ పట్టించుకోకపోవడం లేదు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ముఖ్యంగా డెలివరీకి వచ్చిన మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. పచ్చి బాలింతలకు మలమూత్ర విసర్జన కోసం ఊరు బయట వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో బాలింతలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. నడవలేని స్థితిలోనూ కూడా బయటకు వెళ్లవలసిన పరిస్థితులు ఏర్పడటంతో సమస్యను ఎవరికీ చెప్పుకోలేక మానసిక వేదనతో ఆవేదన చెందుతున్నారు. బాలింతలకు ఇన్‌ఫెక్షన్ జరిగితే ఎవరూ బాధ్యత వహించాలి. ఆసుపత్రిలో నిర్మించిన మరుగుదొడ్లకు చిన్నపాటి మరమ్మతులు చేపడితే రోగులకు ఉపయోగపడే విధంగా ఉపయోగంలోకి వస్తాయని రోగుల కుటుంబీకులు వాపోయారు. ఆసుపత్రిలో డెలివరీకి వచ్చిన మహిళల సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. గతంలో ఆసుపత్రిలో ప్రతినెలా 30 నుంచి 40 వరకు ప్రసావాలు జరిగేవి. కానీ ప్రస్తుతం ఆసుపత్రిలో నెలకు 10 కూడా దాటంలేదు. ఆసుపత్రిపై జిల్లాస్థాయి అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ప్రసవాల సంఖ్య తగ్గిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరించాలని మండలవాసులు కోరుతున్నారు.





అంగన్‌వాడీ టీచర్లకు పూర్తి వేతనం చెల్లించాలి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మినీ నుంచి మెయిన్ అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్, పూర్తి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. శనివారం నాయకులు మాట్లాడుతూ నాలుగు వేల మందికి ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. పోస్టుల భర్తీ, తదితర సమస్యలపై ఆందోళనలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. ఈ నెల 24న ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు, నవంబరు 4న కలెక్టరేట్ ఎదుట దర్నాలు, 11న చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత, ఉపాధ్యక్షురాలు శైలజ, వనజ, భాగ్యలక్ష్మి, విజయ, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన.. ఎమ్మెల్సీ ఓటరు నమోదు!



నిర్మల్‌లో ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేస్తున్న దృశ్యం

- స్పందించని పట్టభద్రులు
- అదేదారిలో టీచర్లు
- నమోదు కోసం ఆశావహుల తంటాలు
- నమోదుకు మరో 17 రోజుల గడువు

నిర్మల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన ప్రక్రియ మొదలు కావడంతో ఈ రెండు పదవులకు వేర్వేరుగా పోటీ చేసే ఆశావహులు ఈ దిశగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. అలాగే అధికార యంత్రాంగం సైతం ఇప్పటికే ఎన్నికకు సంబంధించిన ఏర్పాట్లపై కసరత్తు మొదలుపెట్టింది. ఈ ప్రక్రియలో కీలకమైన ఓటరు నమోదు వ్యవహారం ఆశించిన రీతిలో ముందుకు సాగడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గ్రాడ్యుయేట్స్ టీచర్స్ తమ ఓటరు నమోదు విషయంలో ఆశించిన విధంగా ఆసక్తి చూపక పోతుండడం చర్చనీయాంశమవుతోంది. గతంలో కూడా గ్రాడ్యుయేట్‌లు, టీచర్లు తమ ఓటు నమోదు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఓటర్ల జాబితా చాలా మేరకు కుదించుకుపోయింది. ఈ సారి అలాంటి పరిస్థితి తలెత్తవద్దంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా స్థాయి యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు కొంత మేరకు ఓటరు నమోదు విషయంలో చర్యలు చేపడుతున్నారు. అయితే గ్రాడ్యుయేట్‌లు, టీచర్లు ఓటరు నమోదు విషయంలో ఆశించినంతగా స్పందించకపోతుండడం పట్ల బిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నవంబరు 6వ తేదీ వరకు ఈ ఓటరు నమోదుకు సంబంధించి తుది గడువు కావడంతో అధికార యంత్రాంగం మరింత దృష్టి సారిస్తోంది. ఇదిలా ఉండగా కరీంనగర్ గ్రాడ్యుయేట్ టీచర్స్ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్సీలుగా పోటీ చేయాలని భావిస్తున్న వారంతా ఈ ఓటరు నమోదుపై కొంత మేరకు కసరత్తులు చేస్తున్నారు. దీనికి అనుగుణంగానే ఈ నియోజకవర్గ పరిధిలోని ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో తమ అనుచరులు, తన అనుయాయుల ద్వారా ఓటరు నమోదు ప్రక్రియ విషయంలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుండడమే కాకుండా ఓటరు నమోదు ఫారాలను సైతం పంపిణీ చేస్తున్నారు. గడువులోగా ఆశించిన మేరు కన్నా రెండింతల ఓటరు నమోదు జరిగే విధంగా అధికారులు అవగాహన కార్యక్రమాలను సైతం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

పట్టభద్రుల నియోజకవర్గం నుంచి

కాగా కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్న పలువురు ఆశావహులు ఇప్పటికే రంగంలోకి దిగి తమ వంతు ప్రయత్నాలు ముమ్మరంగా మొదలుపెట్టారు. ముఖ్యంగా నిరుద్యోగ గ్రాడ్యుయేట్‌లు, ఉద్యోగ గ్రాడ్యుయేట్‌ల మద్దతును కూడగట్టేందుకు వారి క్షేత్రస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే అవగాహన సదస్సుల పేరిట ముఖ్యమైన పట్టణ ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి విందులు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు పాత్ర పేరిట మరికొంత మంది సమావేశాలు ఏర్పాటు చేసి రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము పోటీ చేయాలని భావిస్తున్నామని, తమకు మద్దతునివ్వాలని బహిరంగంగా కోరుతున్నారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీ తరపున ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, సిట్టింగ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆర్. సత్యానారాయణతో పాటు మరికొంత మంది పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. వీరంతా ఇప్పటికే సోషల్ మీడియాలో సైతం ఓ వైపు ప్రత్యక్షంగా, మరోవైపు పరోక్షంగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అలాగే బీజేపీ నుంచి నిర్మల్‌కు చెందిన ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ భర్త సత్యనారాయణ గౌడ్‌తో పాటు మరికొంత మంది కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ఆ పార్టీ నాయకులు పోటీ చేసేందుకు ఇప్పటికే తమ వంతు ప్రయత్నాలు మొదలు పెట్టారంటున్నారు. కాగా బీఆర్ఎస్ పార్టీ తరపున మాత్రం పోటీ ఉంటుందో లేదో నన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

టీచర్స్ ఎమ్మెల్సీదీ అదే పరిస్థితి

ఇదిలా ఉండగా కరీంనగర్ టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి కూడా పోటీ చేసే అభ్యర్థులు ఓటరు నమోదు విషయంలో ముమ్మర ప్రయత్నాలు మొదలు పెట్టారు. ముఖ్యంగా పీఆర్‌టీయూ తెలంగాణ, పీఆర్‌టీయూ టీఎస్, ఎస్టీయూ, యూటీఎఫ్, టీయూటీఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాల నుంచి ఈ సారి అభ్యర్థులు బరిలో నిలిచే అవకాశాలున్నాయంటున్నారు. ఇప్పటికే పీఆర్‌టీయూ టీఎస్ తమ అభ్యర్థిగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి పేరును ఖరారు చేసిన సంగతి తెలిసిందే. అలాగే ఎస్టీయూ, యూటీఎఫ్ అభ్యర్థులు కూడా మరికొద్ది రోజుల్లోనే ఖరారు కానున్నట్లు చెబుతున్నారు. అయితే టీచర్స్ యూనియన్‌లు స్కూల్ అసిస్టెంట్‌లను ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాయి. అయినప్పటికీ ఇప్పటి వరకు ఆశించిన రీతిలో ఓటరు నమోదు ప్రక్రియ మొదలు కాలేదంటున్నారు. మరో వారం రోజుల్లోగా ఇటు గ్రాడ్యుయేట్స్ అటు టీచర్స్ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు రెండు నియోజకవర్గాల ఆశావహులు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేయబోతున్నారంటున్నారు.

మరో 17 రోజులు మాత్రమే గడువు

కాగా గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించి నవంబరు 6వ తేదీ వరకు మాత్రమే గడువు ఉండడంతో ఈ ఎన్నికల్లో పోటీ చేసే ఆశావహులు ఉత్కంఠకు గురవుతున్నారు. పెద్ద ఎత్తున ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టి వారందరి మద్దతును కూడగట్టాలని భావిస్తున్నారు. అలాగే ఆశావహులకు సంబంధించిన అనుచరులు కూడా నేడో రేపో రంగంలోకి దిగి ఓటరు నమోదు ప్రక్రియను సీరియస్‌గా చేపట్టే అవకాశాలున్నాయంటున్నారు. మరికొంత మంది ఓటరు నమోదు కోసం ఏరియాల వారీగా ఏజెంట్లను నియమించుకొని వారికి కమిషన్‌లు చెల్లించేందుకు కూడా సిద్ధమవుతున్నాయంటున్నారు. మొత్తానికి టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు వ్యవహారం అటు అధికార యంత్రాంగానికి ఇటు పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులకు సవాలుగా మారనుందని చెబుతున్నారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య



శ్రీనివాస్ మృతదేహం

ఖానాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై మద్యం మానలేక పోతున్నాననే ఆవేదనతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన కడెం మండలం అంబర్‌పేట్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కడెం ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపిన కథనం ప్రకారం... మండలంలోని అంబర్‌పేట్ గ్రామానికి చెందిన బొలిశెట్టి శ్రీనివాస్(34) అనే యువకుడు కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేందుకు పలు విధాలుగా ప్రయత్నం చేసినప్పటికీ తనకున్న అలవాటును మానలేక పోయాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. దీంతో శ్రీనివాస్‌ను వెంటనే కుటుంబ సభ్యులు నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం శ్రీనివాస్ మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు శ్రీనివాస్ భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని శిశువు మృతదేహం లభ్యం

సారంగాపూర్, అక్టోబరు 17 : మండలంలోని బోరిగాం గ్రామ సమీపంలో గురువారం గుర్తు తెలియని శిశువు మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోరిగాం గ్రామ సమీపంలో గల కాలువలో గుర్తు తెలియని శిశువు మృతదేహం ఉన్నట్లు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని శిశువు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పిడుగుపాటుతో మేకలు మృతి



పిడుగు పాటుకు మృతి చెందిన మేకలు

సారంగాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల రాంసింగ్ తండాకు చెందిన చవాన్ ఇనెస్ గురువారం అటవీ ప్రాంతానికి మేకలను పశు గ్రాసం కోసం తీసుకొని వెళ్లే సమయంలో పశుగ్రాసం చేస్తున్నటువంటి మేకలకు పిడుగు కొట్టడంతో 30 మేకలు మృతి చెందినట్లు తండా వాసులు తెలిపారు. సుమారు ఈ మేకల విలువ రూ. 3 లక్షలు ఉంటుందని తెలిపారు.

పేండ్‌పల్లిలో మరొకరు

భైంసా రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పేండ్‌పల్లి గ్రామానికి చెందిన జి.గంగయ్య (40) పని పాట లేకుండా పోకిరి లాగా తిరుగుతూ మద్యం తాగుతూ భార్యతో ప్రతి రోజు గొడవ పడుతూ ఉండేవాడు. ఎప్పటిలాగే భార్యతో గొడవ పడి మద్యానికి డబ్బులు ఇవ్వమని గొడవ చేసి ఇంట్లో నుంచి బుధవారం ఉదయం వెళ్లిపోయాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోయేసరికి తన తండ్రి భూమయ్య గ్రామంలోని వారి పశువుల కొట్టానికి వెళ్లి చూసేసరికి పురుగుల మందు తాగి పడిపోయి ఉన్నాడు. వెంటనే భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థి ఎంపిక

భైంసా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని నారాయణ హైస్కూల్‌కు చెందిన తూమోల్ల భువన చంద్ర అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి అండర్ 14 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన జోనల్ స్థాయి క్రికెట్ పోటీల్లో అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించి సదరు విద్యార్థి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. గురువారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థి తూమోల్ల భువన చంద్రకు నారాయణ హైస్కూల్ ఏజీఎం కె. ప్రసాద్, ప్రిన్సిపల్ కె. ప్రభు. డీన్ గంగాధర్, అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జీ గజ్జారామ్, తోటి విద్యార్థులు అభినందించి జ్ఞాపికలు బహూకరించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్ఆర్ఎస్‌పై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు పరిష్కరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా ఎక్కువ లాగిన్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెవెన్యూ, మున్సిపల్, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశించారు. అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి వివరాలను నమోదు చేసి, అధికారులకు అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్వో భుజంగ్ రావు, నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు రాజు, రాజేష్ కుమార్, మనోహర్, డీపీవో శ్రీనివాస్, రెవెన్యూ, ఇరిగేషన్, పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ముథోల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌ను అన్నివిధాల అభివృద్ధి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. ముథోల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకానికి సంబంధించిన 100 చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను గెలిచినప్పటి నుంచి 10 నెలల్లో ముథోల్ నియోజకవర్గంలో 2500 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశామన్నారు. ఆడబిడ్డ పెళ్లి చేసిన కుటుంబాలకు ప్రభుత్వ సహాయం సకాలంలో అందేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నానన్నారు. ముథోల్‌లో పాలిటెక్నిక్ డిప్లొమా కళాశాల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ముథోల్ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. రూ. 30 కోట్లతో ముథోల్ నుంచి పంచగుడి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావటంతో పనులను ప్రారంభించటం కూడా జరిగిందన్నారు. ముథోల్ అభివృద్ధికి తాను నిరంతరంగా కృషి చేస్తానన్నారు. ప్రజాసేవకు తన జీవితం అంకితం అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ నారాయణ పటేల్, బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న, నాయకులు నర్సాగౌడ్, సాంప్లీ రమేష్, మోహన్ రెడ్డి, తాటివార్ రమేష్, సప్పటోల్ల పోతన్న, కదం సంతోష్, దత్తాద్రి, లక్ష్మీ నారాయణ, శ్రీనివాస్, సుదర్శన్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

- నివాళులర్పించిన అదనపు కలెక్టర్



నివాళులర్పిస్తున్న కిషోర్ కుమార్

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 17 : నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వాల్మీకి జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ... బోయ కులంలో జన్మించిన వాల్మీకి రామాయణ మహా కావ్యాన్ని రచించి మహా కవిగా పేరుగాంచారన్నారు. ఇది జాతి గుర్తుంచుకునే ముఖ్యమైన రోజన్నారు. రామాయణ, మహాభారత కావ్యాలను ఈతరం విద్యార్థులు, యువతకు తెలియజేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి రాజేశ్వర్ గౌడ్, సీపీవో జీవరత్నం, డీఎస్‌వో కిరణ్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ్రయులైన బాలురకు సేవలందించడం అభినందనీయం

భైంసా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తల్లి, తండ్రులు కోల్పోయి నిరాశ్రయులైన బాలురను చేరదీసి అవాసం కల్పించి సేవలందించడం ఎంతో అభినందనీయమని బాలల సంక్షేమ సమితి ప్రతినిధి జే.అనిల్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ వివేకానంద అవాస కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. నిరాశ్రిత బాలురకు చదువు అందించడంతో పాటు వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు అవాస నిర్వాహకులు చేపడుతున్న చర్యలు మార్గదర్శకంగా ఉన్నాయన్నారు. అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసేందుకు ఆదర్శవంతంగా సేవలు అందిస్తున్నారని కితాబునిచ్చారు. ఈ సందర్భంగా బాలల సంక్షేమ సమితి ప్రతినిధి అవాస నిర్వాహణ వ్యవస్థను పర్యవేక్షించారు. విద్యార్థులతో మాట్లాడి అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగానే భైంసా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డా. స్వప్న, డా. ఫిర్దోస్ జబీన్‌ల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించారు. ఇందులో జిల్లా బాలల పరిరక్షణ అధికారి దేవి మురళి, పీవోఐసీ సగ్గం రాజు, వివేకానంద అవాసం అధ్యక్షులు శైలేష్ మహాశెట్టివార్, నిర్వాహకులు వై.లింగారెడ్డి, సౌమ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ స్వప్న

పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించాలి

- డీఎంహెచ్‌వో రాజేందర్

నిర్మల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి సమన్వయం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ అన్నారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంపై వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్ మాట్లాడుతూ... తీవ్ర పోషకాహార లోపంతో, సాధారణ పోషకాహార లోపంతో బాధ పడుతున్న పిల్లలను వెంటనే గుర్తించి, స్త్రీ సంక్షేమ శాఖతో సమన్వయం చేసుకొని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నయనా రెడ్డి, డాక్టర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సౌమ్య, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

- డీపీవో శ్రీనివాస్

కుంటాల, అక్టోబర్, 17, (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని కల్లూరు రైతు వేదికలో లోకేశ్వరం, భైంసా, కుంటాల మండలాలతో పాటు ఆయా మండలాల ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అందరి భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. అధికారులు బాధ్యతతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆయా మండలాల ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీమా పథకాలతో ఆర్థిక భరోసా

కుంటాల, అక్టోబర్, 17 (ఆంధ్రజ్యోతి) : బీమా పథకాలతో ఆర్థిక భరోసా లభిస్తుందని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రాంగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని కల్లూర్ రైతు వేదికలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భీమా చేసుకోవాలని, బీమా పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు టీజీబీ బ్యాంకు మేనేజర్ మేఘన, సహకార సంఘం మేనేజర్ సాదిక్, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి కోసం వినతి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మీ నిధులు విడుదల చేయించాలని కోరుతూ గురువారం ఎంఐఎం నాయకులు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్ మొహమ్మద్ ముజాహిద్ అలీ, మాజీ కౌన్సిలర్ రఫీక్ అహ్మద్ ఖురేషి, తదితరులు గత ఏడాది నుంచి షాదీ ముబారక్ సహాయం అందడం లేదని తెలిపారు. నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

కుభీర్, అక్టోబరు 17: మండల గురువారం పీఆర్‌టటీయూ తెలంగాణ సభ్యత్వ నమోదు స్వీకరించినట్లు ఆ సంఘం రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షులు సొప్పర్‌వార్ శంకర్ తెలిపారు. మండలంలోని 15 నుండి 22 మంది ఉపాధ్యాయులు సభ్యత్వ నమోదు చేసుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

విఠలేశ్వర ఆలయంలో ప్రారంభమైన కాకడహారతి

కుభీర్, అక్టోబరు 17 : మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వర ఆలయంలో పాల పౌర్ణమిను పురష్కరించుకొని గురువారం వేకువజామున కాడహారతిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలోని దేవతామూర్తులకు పంచామృత స్నానం పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.